ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
శనివారం 23 నవంబరు 2024



పుష్ప సోయగం.. ప్రకృతి పరవశం

మహేశ్వరం నుంచి మన్‌సాన్‌పల్లి చౌరస్తాకు వెళ్లే రోడ్డు పక్కన బంతి తోటలోని పూల సోయగాలు ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటున్నాయి. రోడ్డు పక్కన విరబూసిన పసుపు పచ్చని పూల అందాలు ఆ దారివెంట వెళ్లేవారిని సంభ్రమాశ్చర్యానికి గురిచేస్తున్నాయి. కొందరు తోటలోకి వెళ్లి సెల్ఫీలు దిగి ఆనంద పడుతున్నారు.

మహేశ్వరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి)



చిన్నతూండ్లలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

ఫార్మాసిటీని రద్దు చేయాలి

» సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాన్‌వెస్లీ

యాచారం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఫార్మాసిటీ ఏర్పాటును రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం యాచారం మండలంలోని చిన్నతూండ్లలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫార్మాసిటీ వల్ల కలిగే నష్టాలు సీఎం రేవంత్ రెడ్డికి తెలిసి కూడా ఏర్పాటుకు పూనుకోవడం సరికాదన్నారు. దళితులు, గిరిజనులు, మైనార్టీలపై జరిగే దాడులను నిరోధించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేదలు ఇళ్లు నిర్మించుకోవడానికి రూ.10లక్షల సాయం అందించాలన్నారు. సింగరేణి గనులను వేలం వేయకుండా కేంద్రంపై వత్తిడి తీసుకురావాలన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు నెలకు రూ.26వేల వేతనం ఇవ్వాలన్నారు. సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై కాలుష్య రహిత పరిశ్రమలు ఏర్పాటు చేసి యవతకు ఉపాధి చూపాలని కోరారు. మండల రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు బి.మధుసూదన్‌రెడ్డి, సీపీఎం కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ, యాదయ్య, బోడ సామేల్, పి.బ్రహ్మయ్య, అంజయ్య, వినోద్‌కుమార్, చందూనాయక్, జంగయ్య తదితరులున్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

» వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణ

శంషాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రజకులను ఎస్సీల జాబితాలో చేర్చాలని రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ డిమాండ్ చేశారు. శంషాబాద్‌లోని ఎలైట్ హోటల్‌లో శుక్రవారం జిల్లా రజక వృత్తిదారుల సమాఖ్య జిల్లా సమితి సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ 50ఏళ్లు దాటిన రజకులకు రూ.4 వేల పింఛను ఇవ్వాలని డిమాండ్ చేశారు. రజకులపై జరుగుతున్న దాడులు జరగకుండా సాంఘిక భద్రతా చట్టాన్ని తీసుకురావాలన్నారు. జనాభా ప్రతి పాదికన బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 250 యూనిట్ల ఉచిత కరెంటును 500 యూనిట్లకు పెంచాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మోడ్రన్ దోబీఘాట్ల నిర్మాణం పూర్తిచేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోకూడా దోబీఘాట్లకు స్థలాలు కేటాయించాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, కేతరాజు నరసింహ, జోజిలతో పాటు రజకసంఘాల సభ్యులు పాల్గొన్నారు.



వ్యర్థాలు వేసిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ బాలాజీ

బహిరంగ ప్రాంతాల్లో వ్యర్థాలు పారబోస్తే చర్యలు

» మున్సిపల్ కమిషనర్ బాలాజీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొత్తూర్, నవంబర్ 22:(ఆంధ్రజ్యోతి) పరిశ్రమల నుంచి వెలువడుతున్న వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పారబోస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ బాలాజీ హెచ్చరించారు. ఈనెల 21న 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితమైన 'ఎక్కడపడితే అక్కడే.' శీర్షికన ప్రచురితమైన కథనానికి కమిషనర్ స్పందించారు. కొత్తూర్ పారిశ్రామికవాడతో పాటు, తీగాపూర్ రోడ్డు పక్కన వ్యర్థాలు వేసిన ప్రదేశాలను శుక్రవారం సిబ్బందితో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల నుంచి కానీ, చికెన్ సెంటర్ల నుంచి వచ్చే వ్యర్థాలను కానీ బహిరంగ ప్రాంతాల్లో పారబోస్తే తక్షణ చర్యగా రూ.5వేలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అలాగే నోటీసులు అందజేస్తామన్నారు. ఇప్పటికే ఓ పరిశ్రమకు నోటీసు కూడ ఇచ్చామని తెలిపారు. శనివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి రోడ్డు పక్కన పేరుకుపోయిన వ్యర్థాలను సిబ్బంది చేత తొలగిస్తామని పేర్కొన్నారు.

నిధులున్నా.. నిర్లక్ష్యం!



ఎంపీ ల్యాడ్స్ వినియోగంలో అలసత్వం

కేంద్రం నుంచి నిధులు విడుదలవుతున్నా ఎంపీలు వాటిని వినియోగించుకోవడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. ఏడాదికి రెండు మార్లు వచ్చే ఈ ల్యాడ్స్‌తో పార్లమెంట్ నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టవచ్చు. కానీ వచ్చిన నిధుల్లో సగం కూడా వీటి కోసం ఖర్చు చేసిన దాఖలాలు కనిపించడం లేదు. ఎంపీ నిధులతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు, శంకుస్థాపనలకే పరిమితమవుతున్నాయి.

చేవెళ్ల ఎంపీ అభివృద్ధి నిధుల ఉపయోగం అంతంతే..

2019-20, 2023-24 వరకు 289 పనులకు రూ.17 కోట్లు మంజూరు

రూ. 1,567.28 లక్షలతో 108 పనులు మాత్రమే పూర్తి

జిల్లాలో ఇతర ఎంపీల నిధులు, పనులు కూడా ఇదే తీరు..

అభివృద్ధి పనులు ప్రతిపాదనలు, శంకుస్థాపనలకే పరిమితం

పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు



మహేశ్వరం మండలం తుమ్మలూరులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న అప్పటి ఎంపీ రంజిత్‌రెడ్డి (ఫైల్)

ఉమ్మడి జిల్లాలో ప్రతిపాదిత పనుల పురోగతి

ఎంపీ	మంజూరైనవి	పూర్తయినవి	అంచనా వ్యయం (లక్షల్లో..)	ఖర్చు చేసింది (లక్షల్లో..)
రేవంత్‌రెడ్డి (మల్కాజిగిరి)	23	15	100.97	58.972
కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి (భువనగిరి)	75	36	97.99	46.499
పోతుగంటి రాములు (నాగరకర్నూల్)	40	29	156.65	92.530
మన్నె శ్రీనివాస్ (మహబూబ్‌నగర్)	33	11	139.50	36.531

రంగారెడ్డి అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఓవైపు అభివృద్ధి పనులకు నిధుల కోసం ఎదురు చూస్తుంటే.. మరో వైపు ఉన్న వాటిని వినియోగించుకోవడంలో ఎంపీలు వెనుకబడి పోతున్నారు. ఎంపీ ల్యాడ్స్ కింద రూ.కోట్లు నిధులు విడుదలవుతున్నా వాటిని ఖర్చు చేయడంలో తాత్సారం జరుగుతోంది. పార్లమెంట్ నియోజకవర్గాల అభివృద్ధి నిధులు (ఎంపీ ల్యాడ్స్) ఖర్చు పెట్టడంతో నిర్లక్ష్యం అలుముకుంది. కేంద్రం నుంచి వచ్చిన నిధులను సకాలంలో సద్వినియోగం చేసుకోవడంలో ఎంపీలు విఫలమవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఎంపీలు తాము ప్రాతినిధ్యం

మిగతా 7వ పేజీలో...



చేవెళ్లలో పత్తి కొనుగోలు కేంద్రంలో మాట్లాడుతున్న నర్సింహారావు

కొనుగోలు కేంద్రాల్లోనే పత్తిని విక్రయించాలి

జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు

చేవెళ్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పత్తిని ప్రభుత్వం ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు సూచించారు. చేవెళ్లలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న పలువురు రైతులతో మాట్లాడారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రధాన సెంటర్లలో పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పత్తి కొనుగోలు కేంద్రాలకు పత్తిని తీసుకరావచ్చని సూచించారు. రైతులకు ఇబ్బందులు కలుగ కుండా పత్తిని తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఎలాంటి సందేహాలు ఉన్న వ్యవసాయ అధికారులతో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆయనతో పాటు చేవెళ్ల ఏడీ ఏ సురేశ్‌బాబు, ఏవో శంకర్‌లాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, ఏఎంసీ కార్యదర్శి మహేందర్, ఏఈవోలు రాజేశ్వర్‌రెడ్డి, బాలకృష్ణ, రైతులు తదితరులు ఉన్నారు.

కొత్త కమిటీలు



సులోచన కృష్ణారెడ్డి



మహ్మద్ అలీఖాన్ బాబర్

మార్కెట్ కమిటీలకు పాలకవర్గాల నియామకం



యాట గీతానర్సింహ



గూడూరు భాస్కర్‌రెడ్డి

షాద్‌నగర్, నవంబరు 22:(ఆంధ్రజ్యోతి) షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్‌పర్సన్‌గా కాంగ్రెస్ పార్టీ కొందుర్గు మండల అధ్యక్షుడు, అగిర్యాల గ్రామానికి చెందిన ఎ.కృష్ణారెడ్డి సతీమణి ఎ.సులోచన, వైస్‌చైర్మన్‌గా షాద్‌నగర్ పట్టణానికి చెందిన పీసీసీ సభ్యుడు మహ్మద్ అలీఖాన్ బాబర్‌ను నియమిస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం త్వరలో ప్రమాణ స్వీకారం చేయబోతున్నట్లు సమాచారం.

కల్వకుర్తి నియోజకవర్గంలో...

ఆమనగల్లు : కల్వకుర్తి నియోజకవర్గంలోని రెండు మార్కెట్ కమిటీలకు ప్రభుత్వం పాలక వర్గాలను నియమించినట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా కడ్తాల మండలం మక్తమాదారం గ్రామానికి చెందిన యాట గీత నర్సింహ్మ, వైస్ చైర్మన్‌గా కడ్తాల మండల కేంద్రానికి చెందిన గూడూరు భాస్కర్ రెడ్డి నియమించారు. మార్కెట్ పాలకవర్గంలో కడ్తాల నుంచి ముగ్గురికి, మాడ్గుల నుంచి నలుగురికి, తలకొండపల్లి నుంచి నలుగురికి, ఆమనగల్లు నుంచి ముగ్గురికి అవకాశం లభించింది. ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మ పార్టీకి అందించిన సేవలకు గుర్తింపు లభించింది.ఆయన సతీమణి గీతకు ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్‌గా అవకాశం లభించింది. కల్వకుర్తి మార్కెట్ చైర్‌పర్సన్‌గా మనీల, వైస్‌చైర్మన్‌గా పండిత్‌రావు, డైరెక్టర్లుగా నారాయణ, కొండల్, బీమ్లా, రమాకాంత్ రెడ్డి, కృష్ణయ్య, రాజశేఖర్, ముస్తాపా, యాదయ్య, అనుసుద్దీన్, రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, రాంరెడ్డిలను నియమించారు.

డిమాండ్ల సాధనకు 'బీసీల సమరభేరి'

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్

కడ్తాల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ల సాధనకు బీసీలంతా సంఘటితంగా పోరాటం సాగించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్ పిలుపునిచ్చారు. ఈనెల 25న రవీంద్రభారతిలో బీసీల సమర భేరి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కడ్తాలలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పిప్పల్ల వెంకటేశ్ అధ్యక్షతన శుక్రవారం సమరభేరి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎర్రోళ్ల రాఘవేందర్ ముఖ్య అతిథిగా హాజరై సమర భేరి కర పత్రాలు, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం రాఘవేందర్ మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం బీసీ వ్యతిరేక విధానాలు విడనాడాలని ఆయన కోరారు. చట్టసభల్లో సరైన ప్రాతినిధ్యం లేకే బీసీలు అన్ని రంగాల్లో అన్యాయానికి గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. 60 శాతం ఉన్న బీసీలకు ప్రభుత్వాలు, అన్ని రాజకీయపార్టీలు సముచిత స్థానం కల్పించాలని ఆయన కోరారు. రవి, ప్రేమ్‌రాజ్, వెంకటేశ్, యాదయ్య, చంద్రశేఖర్, షరీఫ్, కుమార్, మహేశ్, కృష్ణయ్య ఉన్నారు



కేశంపేట- షాద్‌నగర్ రోడ్డు దుస్థితి

రహదారుణం

అధ్వానంగా కేశంపేట- షాద్‌నగర్ ప్రధాన రహదారి

గుంతలమయంగా రోడ్డు..

ఇబ్బందుల్లో వాహనదారులు

తరచూ ప్రమాదాలు..

పట్టించుకోని పాలకులు

రోడ్డును విస్తరించాలని స్థానికుల డిమాండ్

కేశంపేట, నవంబరు22 (ఆంధ్రజ్యోతి): కేశంపేట - షాద్‌నగర్ ప్రధాన రహదారి అడుగుకో గుంత.. గజానికో గొయ్యిలా మారింది. 22 కిలోమీటర్ల ఈ దారిలో ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తే గంటన్నర సమయం పడుతుందంటేనే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. గోతులమయమైన ఈ రోడ్డుపై తరుచు ప్రమాదాలు జరుగుతుండటంతో వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. అధ్వానంగా ఉన్న ఈ రహదారిని పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు.

కేశంపేట శివారులోని నూర్ ప్యాలెస్ సమీపంలో రోడ్డు పూర్తిగా పాడైంది. ఇటీవల ఇక్కడ జరిగిన ప్రమాదంలో బొదునంపల్లి గ్రామానికి

మిగతా 8వ పేజీలో...

పట్టుతప్పితే ప్రమాదం

సరిపడా బస్సులు నడపని ఆర్టీసీ

కిక్కిరిసి ప్రయాణిస్తున్న విద్యార్థులు

బస్సు మిస్సయితే కాలినడకే దిక్కు

సర్వీసులు పెంచాలని డీఎంకు వేడుకోలు



8

గుడిలో శివలింగం అపహరణ

వినాయక విగ్రహాన్ని తొలగించిన దుండగులు

ఫరూఖ్‌నగర్‌లోని బసవన్న ఆలయంలో ఘటన

ఆందోళన చేపట్టిన హిందూ సంఘాలు

దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు



7

'కోనోకార్పస్'తో ముప్పు!

పిట్ట వాలని చెట్లతో ప్రాణాంతకం

పర్యావరణానికి పెనుముప్పు

పుప్పొడితో అలర్జీ, శ్వాసకోశ వ్యాధులు

చేవెళ్ల మండలంలో ఏపుగా మొక్కలు



7

గోవులను తరలిస్తున్న వాహనం పట్టివేత

పెద్దేముల్, నవంబర్ 22(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా గోవులు తరలిస్తున్న వాహనం పట్టుకుని పోలీసులు కేసునమోదు చేశారు. పెద్దేముల్ ఎస్ఐ గిరి తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరు నుంచి జహీరాబాద్ వైపు బుధవారం అర్ధరాత్రి ఐషర్ వాహనంలో 17 గోవులు, ఐదు లేగదూడలను తరలిస్తుండగా తట్టెపల్లి వద్ద పోలీసులు పట్టుకున్నారు. వాటికి ఎలాంటి రక్షణ లేకుండా ఒకదానిపై ఒకటి పడినట్లుగా ఉంచి తరలిస్తున్నారు. అదేవిధంగా గోవులు తరలించడానికి వాహనదారుడి వద్ద ఎలాంటి అనుమతి పత్రాలూ లేవు. దీంతో వాహనాన్ని పెద్దేముల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గోవులు తరలిస్తున్న కోహిర్ గ్రామానికి చెందిన జైనొద్దీన్‌పై, గోవులు తరలిస్తున్న ఐషర్ వాహనంపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గిరి తెలిపారు.

మీరాలం కుంటను పరిశీలించిన 'హైడ్రా'

- వివరాలు సేకరించిన అధికారులు
- భయాందోళనలో పలువురు నిర్మాణదారులు


మీరాలం కుంటను పరిశీలిస్తున్న హైడ్రా అధికారులు, పక్కన కౌన్సిలర్ వెంకటేశ్ గౌడ్

ఘట్‌కేసర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలోని మీరాలంకుంటను శుక్రవారం హైడ్రా అధికారులు పరిశీలించారు. నాలుగు నెలల క్రితం 10వ వార్డు కౌన్సిలర్ బాలగోని వెంకటేష్ గౌడ్ కుంటలో ఆక్రమాలపై హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు కుంటను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. బతుకమ్మ ఘాట్ పేరుతో మున్సిపల్ చైర్మన్ దాదాపు రెండువేల చదరపు గజాల చెరువును పూడ్చివేశాడని అధికారులకు తెలిపారు. ఈ విషయమై పోచారం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైనట్లు తెలిపారు. కుంట అలుగులను మూసివేసి మరోచోట ఏర్పాటు చేశారని, దీంతో తమ కుటుంబసభ్యుల వ్యవసాయ భూమి మునిగిపోతున్నదని రికార్డులను పరిశీలించి అలుగును పునరుద్ధరించాలని కోరారు.

70కి పైగా పార్కుల ఆక్రమణ

లక్షల రూపాయలు వెచ్చించి చెరువుకు తూము ఏర్పాటు చేశారని దానికింద ఇళ్ల నిర్మాణం చేశారని దాంతో నీరు దిగువకు వెళ్లలేని పరిస్థితి నెలకొన్నదని హైడ్రా అధికారులకు వివరించారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలో 70కి పైగా పార్కులు ఆక్రమణలకు గురయ్యాయని పార్కు స్థలాల్లో రిజిస్ట్రేషన్లు నిలిపి వేయాలని మున్సిపల్ కమిషనర్ గతంలోనే ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ప్రధానంగా చెరువు పూడ్చివేతకు మున్సిపాలిటీ నిధులు ఎలా వినియోగించారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కాగా అన్నోజిగూడలో హైడ్రా అధికారులు పర్యటించిన విషయం మున్సిపాలిటీ పరిధిలో తీవ్ర చర్చనీ అంశంగా మారింది. నాళాలు, బఫర్‌జోన్ల పరిధిలో నిర్మించిన నిర్మాణాల విషయంలో అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని పలువురు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

కృత్రిమ మేధతో ఉపయోగాలెన్నో..


కేరీర్ గైడెన్స్ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధస్సుతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని మైక్రోసిస్ లాజిక్ సంస్థ సీఈవో విజయవీర అన్నారు. అనురాగ్ యూనివర్సిటీలో శుక్రవారం జరిగిన కేరీయర్ గైడెన్స్ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅథితిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ విభాగంలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. కృత్రిమ మేధస్సుతో పనిచేసే ఎలక్ట్రానిక్ వస్తువుల ప్రాముఖ్యతను తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇండస్ట్రీ అలియన్స్ సంస్థ డైరెక్టర్ సిద్దార్థ ఘోష్, అధ్యాపకులు మంగళగౌరీ, అనిల్‌కుమార్, అభిరామ్, నాయబ్ రసూల్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బసవన్న ఆలయంలో శివలింగం అపహరణ

వినాయకుడి విగ్రహాన్ని తొలగించిన దుండగులు


స్థలాన్ని పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్‌లోని పురాతన బసవన్న ఆలయంలోని శివలింగాన్ని గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి అపహరించుకుపోయారు. అలాగే ఆలయ ఆవరణలోని వినాయకుడి విగ్రహాన్ని ఉన్నచోటు నుంచి తీసి పక్కకు పడేశారు. ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, గ్రామస్తుల కథనం ప్రకారం.. సుమారు 500 ఏళ్ల కిందటి ఆలయంలో రోజు మాదిరిగానే పూజారి అమర్‌నాథ్ శుక్రవారం ఉదయం పూజలు చేసేందుకు వచ్చారు. గుడిలో శివలింగం కనిపించలేదు. వినాయకుడి విగ్రహం తొలగించబడింది. దాంతో ఆందోళనకు గురైన ఆయన గ్రామస్తులకు విషయం తెలిపారు. వెంటనే అక్కడికి చేరుకున్న హిందూ సంఘాల నాయకులు, గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. వెంటనే నిందితులను పట్టుకుని శిక్షించాలని డిమాండ్ చేశారు. సమాచారం తెలుసుకున్న ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ అక్కడికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఆయన తెలిపారు.

పూడూరు పీహెచ్‌సీ తనిఖీ



ఆస్పత్రిలో మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

పూడూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పూడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీహెచ్‌ఎంవో డాక్టర్ వెంకటరమణ శుక్రవారం తనిఖీ చేశారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి రేణుకుమార్, సమన్వయకర్త మహేశ్, డీపీవోతో కలిసి ఆసుపత్రిలో అన్ని విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రిలో రికార్డులు, అటెండెన్స్ రిజిస్టర్లు, ఇన్‌పేషంట్లు, ఔట్ పేషంట్లు, ప్రసవగది, ఏఎన్‌సీ చెకప్ గదిని పరిశీలించి అక్కడున్న మందులను, వాటి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే అక్కడున్న లాబరోటరీ, అంబులెన్స్, వ్యాక్సీన్ గదిని సైతం తనిఖీ చేశారు. అనంతరం వైద్యాధికారి, ఎంఎల్‌హెచ్‌పీ, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలులతో వ్యాధినిరోధక టీకాలు, ప్రసవాలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, వ్యాక్సినేషన్, ఎంసీహెచ్ కార్యక్రమాలపై ఆయన సమీక్షించారు.

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి



చేవెళ్లలో మాట్లాడుతున్న రామస్వామి

చేవెళ్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రోజురోజుకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి, జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణచారి డిమాండ్ చేశారు. శుక్రవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని సీపీఐ కాలనీ-2లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వాలు మారినా కార్మికుల జీవితాలు మారడం లేదన్నారు. మార్కెట్‌లో నిత్యవసర వస్తువుల ధరలు నిత్యం పెరుగుతున్నా.. కార్మికుల జీతాలు మాత్రం పెరగడం లేదన్నారు. 2010 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు వేతన సవరణ చట్టం అమలు చేయడం లేదన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలో కొత్తకొత్త కంపెనీలు పుట్టుకువస్తున్నా.. స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులను తీసుకొని తక్కువ జీతాలు ఇచ్చి పనులు చేయించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి కార్మికుడికి నెల వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి డప్పు శివయ్య, కార్యవర్గ సభ్యులు మంజుల, మీనాక్షి, పద్మ, లలిత, రాంచందర్, శ్రీను, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

బలవంతపు భూసేకరణ తగదు



లగచర్ల బాధితులతో మాట్లాడుతున్న అరుణజ్యోతి, మల్లులక్ష్మి

బొంరాస్‌పేట్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): లగచర్లలో ఫార్మా కారిడార్ పేరుతో రైతుల నుంచి బలవంతంగా భూ సేకరణ చేయడం సరైంది కాదని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి, కార్యదర్శి మల్లులక్ష్మి అన్నారు. శుక్రవారం వారు లగచర్ల, రోటిబండ తండా, పోలెపల్లి, హకీంపేట్, పులిచర్లకుంట తండాలో పర్యటించారు. భూములు కోల్పోతున్న బాధిత రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం రైతుల పట్టా భూములైతే 80 శాతం, ప్రభుత్వ భూమి అయితే 70 శాతం రైతులు ఒప్పుకుంటే ముందస్తుగా పరిహారం చెల్లించి సేకరించాలన్నారు. ఫార్మా కంపెనీ పేరుతో 1,273 ఎకరాల భూ సేకరణ కోసం జిల్లా అధికారులు లగచర్లకు వెళ్లడంతో ఈ దాడి జరిగిందని, ఈ ఘటనలో అరెస్టయిన బాధిత కుటుంబాలను వారు పరామర్శించి మనోధైర్యం కల్పించామన్నారు. అందరు కలిసికట్టుగా ఉంటే ఫార్మా కారిడార్ ఏర్పాటు రద్దయ్యేంత వరకు వెంట ఉంటామన్నారు. అక్రమంగా అరెస్టయిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా సహాయ కార్యదర్శి ఆశాలత, జిల్లా కార్యదర్శి అనసూయ తదితరులు పాల్గొన్నారు.

25న సామూహిక బిల్వార్చన

కులకచర్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాంబండ శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 25వ తేదీన సామూహిక బిల్వార్చన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు దేవాలయ ఈవో సుధాకర్ తెలిపారు. ఆయన శుక్రవారం దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా పాంబండపై ప్రత్యేక పూజా కార్యక్రమంలో భాగంగా సామూహిక లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10గంటలకు పూజ ప్రారంభమవుతుందన్నారు. పూజలో పాల్గొనే భక్తులు ముందుగా రూ.250 చెల్లించాలని, పూజా సామగ్రి ప్లేట్, గ్లాసు వారే తెచ్చుకోవాలని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

కోనోకార్పస్‌తో ముప్పు!

పిట్ట వాలని చెట్లతో ప్రాణాంతకం

- పర్యావరణానికి పెనుముప్పు
- పుప్పొడితో అలర్జీ, శ్వాసకోశ వ్యాధులు
- చేవెళ్ల మండలంలో ఏపుగా పెరిగిన మొక్కలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



చేవెళ్లలో రోడ్డు పక్కన భారీగా పెరిగిన కోనోకార్పస్ మొక్కలు

చేవెళ్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణాలు, గ్రామాల సుందరీకరణలో భాగంగా గత ప్రభుత్వం హయాంలో నాటిన కోనోకార్పస్ మొక్కలు పర్యావరణానికి పెను ముప్పుగా మారాయి. శ్వాసకోశ సంబంధిత వ్యాధులకు కారణమవుతున్న ఈ మొక్కలను తొలగించాలని పర్యావరణవేత్తలు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు అక్కడక్కడా తొలగించి చేతులు దులుపుకున్నారు. ఏపుగా పెరుగుతున్న ఈ మొక్కలు వాటి పరిసరాల్లో మరే మొక్కను పెరగనివ్వకుండా పర్యావరణానికి హానీ కలిగిస్తుంది. మనుషులతో పాటు జంతువులకు కూడా హానీ కలిగిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ చెట్లమీద ఒక పిట్ట కూడా వాలడం లేదంటే పర్యావరణానికి ఇవి ఎంత హానీకరమో ఇట్టే అర్థమవుతుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే కోనోకార్పస్ మొక్కలను తొలగించాలని కోరుతున్నారు.

అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి

చేవెళ్ల డివిజన్ పరిధిలో మొత్తం 132 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో పచ్చదనం- పరిశుభ్రత, హరితహారం కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వం కోనోకార్పస్ ఒక్కో మొక్కను రూ.50 వెచ్చించి మరీ కొనుగోలు చేసి నాటించారు. వారాల వ్యవధిలో ఈ మొక్కలు విపరీతంగా పెరిగి వేర్లు కూడా భూమిలోకి లోతుగా వెళ్లి వాటి పరిసరాల్లో మరే మొక్కను పెరగనివ్వకుండా చేస్తున్నాయి. దీంతో గ్రామాల్లోకి వెళ్లే రోడ్ల వెంట, ప్రధాన రోడ్ల వెంబడి ఏపుగా పెరిగిన కోనోకార్పస్ మొక్కలు దర్శనమిస్తున్నాయి.

చూడడానికి ఆహ్లాదంగానే.. కానీ

పచ్చదనంతో నిండుకుని ఉన్న ఈ చెట్లును చూస్తే ఆహ్లాదకరంగానే ఉంటుంది. కానీ మొక్కలు పూతకు వచ్చినప్పుడే అత్యంత ప్రమాదకరంగా మారుతోంది. ఈ మొక్కల నుంచి వెలువడే పుప్పొడి రేణువుల వల్ల మనుషుల్లో అలర్జీ, శ్వాసకోశ వ్యాధులు, ఆస్తమా వంటి జబ్బులు రావడమే కాకుండా చివరి వరకు అది కేన్సర్‌కు దారి తీసే అవకాశం ఉందని శాస్త్రవేత్తల పరిశోధనలో తేలింది. దీంతో ఈ మొక్కలను తొలగించాలని గత ప్రభుత్వ హయాంలోనే అధికారులు తీర్మానం చేసినప్పటికీ అక్కడక్కడా రోడ్డు పక్కన తొలగించారు. కానీ గ్రామాల్లో ఉన్న చెట్లను మాత్రం అలాగే వదిలేశారు. పలు పంచాయతీల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాల్లో ఈ మొక్కలే ప్రధానంగా కనిపిస్తున్నాయి. ఈ చెట్ల వలన పక్షులు, జంతువులకు కూడా ఎటువంటి ఉపయోగం లేదు. జంతువులు ఈ ఆకులను తినవు.. ఏ పక్షీ ఈ చెట్టుపై గూడుకట్టదు. దీనికితోడు రోడ్డు పక్కన, ప్రధాన రోడ్డు మధ్యలో నాటిన ఈ మొక్కల వేళ్లు భూమిలోకి లోతుగా పాతుకుపోయి అడ్డువచ్చే కేబుల్ వైర్లు, వాటర్ పైప్‌లైన్లను ధ్వంసం చేస్తున్నాయి. ఇప్పటికైనా మొక్కలు తొలగించి పర్యావరణానికి హానీ కలిగించే మొక్కల నుంచి ప్రజలకు, జంతువులకు, రక్షణ కల్పించాలని పలువురు కోరుతున్నారు.

ప్రజాప్రతినిధులు స్పందించాలి



కోనోకార్పస్ మొక్కలు చాలా గ్రామాల్లో నాటారు. నిత్యం ప్రజలు ఈ మొక్కల పక్క నుంచి వెళ్తున్నారు. మొక్కలు ప్రాణాంతకమని తెలిసినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఇకానైనా స్పందించి వాటిని తొలగించి నీడనిచ్చే ఇతర మొక్కలు, లేదా పండ్ల మొక్కలు నాటాలి. - రామకృష్ణరావు, పర్యావరణ అవార్డు గ్రహీత, చేవెళ్ల

వెంటనే తొలగించాలి



పచ్చదనం పేరుతో నాటిన మొక్కల్లో సగం వరకు కోనోకార్పస్ మొక్కలే ఉన్నాయి. ఎక్కడ చూసినా రోడ్డు వెంట ఈ మొక్కలే దర్శనం ఇస్తున్నాయి. ఉన్నతాధికారులు, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే తొలగించాలి. వాటి స్థానంలో ఇతర మానవాళికి ఉపయోగపడే మొక్కలు నాటాలి. - డాక్టర్, వైభవ్‌రెడ్డి, బీజేపీ నాయుడు, చేవెళ్ల



అగ్గనూరు స్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్



దేవనూరులో రైతులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

యాలాలలో ఉన్నతాధికారుల పర్యటన

ఒకే రోజు ముగ్గురు జిల్లా అధికారుల కార్యక్రమాలు



అక్కంపల్లి కొనుగోలు కేంద్రం వద్ద మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ ఉమాశంకర్

యాలాల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): యాలాల మండల కేంద్రంలో శుక్రవారం ఒకేరోజు ముగ్గురు జిల్లాస్థాయి అధికారులు పర్యటించారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్, అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ పలు గ్రామాల్లో పర్యటించారు. కలెక్టర్ మండల పరిధిలోని అగ్గనూరు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనం విషయం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ దేవనూరులో ధాన్యం కేంద్రాలను సందర్శించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ అక్కంపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం స్థానిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఒకేరోజు కలెక్టర్‌తోపాటు అడిషనల్ కలెక్టర్, సబ్ కలెక్టర్ పర్యటించడంతో అన్ని శాఖల అధికారులు ఆశ్చర్యపోయారు. వారి వెంట తహసీల్దార్ అంజయ్య, ఎంఈవో సుధాకర్, ఆర్ఐలు శరణ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా కొప్పుల!



షాద్‌నగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా కొప్పుల మహేందర్ రెడ్డి నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని నేడో రేపో అధికారంగా ప్రకటించనున్నారు. షాద్‌నగర్ పట్టణానికి చెందిన ఆయన ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగి ఉద్యోగ విరమణ చేశారు. అనంతరం ఆయన న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు. అలాగే షాద్‌నగర్ రెడ్డి సేవా సంఘం తాలుక అధ్యక్షుడుగా బాధ్యతలు నిర్వహిస్తూ పేద రెడ్డి వర్గాల సమగ్రాభివృద్ధికి కృషి చేశారు. ఉపాధ్యాయ, న్యాయవాద వృత్తిలో అపార అనుభవం ఉండటంతో ఆయనకు ఈ పదవి లభించడం హర్షణీయమని పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన అభినందనీయం



ప్రహ్లాద్‌రావుకు ఫొటో అందిస్తున్న ఉత్తమ్

కులకచర్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించడం అభినందనీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్‌రావు తెలిపారు. స్థానిక వీఎస్ ఎంటర్ ప్రైజెస్ నిర్వాహకులు తిరుమలాపూర్ వాస్తవ్యులు సాయిభరత్‌కుమార్, ఉత్తమ్‌కుమార్‌లు ప్లాస్టిక్ నిషేధంపై ప్రచారం చేస్తున్నారు. శుక్రవారం కులకచర్లలో బీజేపీ కార్యాలయంలో ప్రహ్లాద్‌ను కలిసి ఆర్గానిక్ వస్తువులతో తయారు చేసిన ఆయన ఫొటోను అందించారు. ఈ సందర్భంగా ప్రహ్లాద్‌రావు మాట్లాడారు. ప్లాస్టిక్ నిషేధం, పర్యావరణ పరిరక్షణకు యువకులు చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జానకిరామ్, వెంకటయ్యగౌడ్, మైపాల్, చంద్రలింగం, సురేశ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా శక్తి సంబురాలు



పాస్‌బుక్స్ అందజేస్తున్న ఏపీఎం

తలకొండపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా శక్తి సంబురాలు జరుపుకున్నారు. సంఘాలలో కొత్తగా చేరిన సభ్యులకు పాసుబుక్ లను అందజేశారు. మహిళా శక్తి వారోత్సవాల్లో భాగంగా కొత్తగా సభ్యులను చేర్పిస్తున్నట్లు ఏపీఎం శ్రీదేవి తెలిపారు. మహిళలు సంఘటితంగా ముందుకు సాగి తమ శక్తిని చాటాలని ఆమె కోరారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు కార్యక్రమంలో సీసీలు దీప, రాములు, విజయలక్ష్మి, సత్యం, లక్ష్మయ్య, వీవోఏ పాల్గొన్నారు.

సెల్ఫీ వీడియో తీసుకొని యువకుడు ఆత్మహత్యకు యత్నం

కుటుంబీకుల ఫిర్యాదుతో కాపాడిన పోలీసులు



నర్సింహగౌడ్‌తో ఎస్ఐ వెంకటేశ్

ఆమనగల్లు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య చేసుకొని చనిపోతున్నానని ఓ యువకుడు సెల్‌ఫోన్‌లో సెల్ఫీ వీడియో తీసుకొని కుటుంబ సభ్యులకు పంపించిన యువకుడిని ఆమనగల్లు పోలీసులు కాపాడారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం ఈ సంఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని చంపాపేటకు చెందిన నర్సింహగౌడ్ ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపం చెంది ఇంట్లో చెప్పకుండ బయటకు వెళ్లాడు. విఠాయిపల్లి గ్రామ సమీపంలోని ఓ వెంచర్‌లో కూర్చొని తాను చనిపోతున్నానని సెల్ఫీ వీడియో తీసుకొని కుటుంబ సభ్యులకు పంపాడు. ఆందోళనకు లోనైన అతని భార్య, కుటుంబ సభ్యులు రాచకొండ కమిషనరేట్‌లో ఫిర్యాదు చేశారు. నర్సింహ మొబైల్ లోకేషన్‌ను ట్రేస్ చేయగా విఠాయిపల్లిలోని ఓ వెంచర్‌లో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు ఆమనగల్లు పీఎస్‌కు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ వెంకటేశ్, పోలీసు సిబ్బందితో వెంటనే అక్కడికి చేరుకొని నర్సింహగౌడ్‌ను గుర్తించి పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం అతన్ని వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. లోకేషన్ ఆధారంగా వెంటనే అప్రమత్తమై యువకుడిని కాపాడిన పోలీసు సిబ్బంది మల్లేశ్, రఘునాయక్, ఎస్ఐ వెంకటేశ్ లను సీఐ ప్రమోద్ కుమార్ అభినందించారు.

రక్తదానంపై అపోహలు వీడాలి



రక్తదాన శిబిరంలో గోలి శ్రీనివాస్ రెడ్డి

కడ్తాల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రక్తదాతలు ప్రాణదాతలుగా నిలుస్తారని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రక్తదానంపై ప్రజలు అపోహలు వీడాలని ఆయన కోరారు. కడ్తాల మండల కేంద్రంలో శుక్రవారం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తుప్పరి రాజు, సిద్దిగారిమహేశ్ ల జ్ఞాపకార్థం వారి స్నేహితులు, కుటుంబ సభ్యులు రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని మాజీ జెడ్పీటీసీ దశరథ్ నాయక్ ప్రారంభించారు. కార్యక్రమానికి గోలి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిబిరంలో 85 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కోల్పోయిన స్నేహితుల జ్ఞాపకార్థం రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో సీఐ శివప్రసాద్, ఎస్ఐ వరప్రసాద్, తహసీల్దార్ ముంతాజ్, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మీనర్సింహారెడ్డి , ఎర్రోళ్ల రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

నిధులున్నా.. నిర్లక్ష్యం!

(5వ పేజీ తరువాయి)

వహించే నియోజకవర్గాల కోసం ఖర్చు చేసేందుకు వీలుగా ఏడాదిలో రెండుసార్లు రూ. 5 కోట్ల మొత్తాన్ని ఇస్తున్నారు. ఈ నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టొచ్చు. కానీ.. ఉన్న నిధులు పూర్తి స్థాయిలో ఖర్చుచేయలేక పోతున్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో ఈ పరిస్థితి నెలకొంది. ఎంపీ నిధులతో వివిధ అభివృద్ధి పనులు ప్రతిపాదనలు, శంకుస్థాపనలకే పరిమితమవుతున్నాయి. రంగారెడ్డి జిల్లాకు ఇతర ఎంపీలు ఇచ్చిన నిధులు కూడా వినియోగించుకోలేక పోవడం విడ్డూరంగా ఉంది. పట్టించుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇదీ పరిస్థితి..!

2019-20, 2023-24 వరకు చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో కేంద్ర ప్రభుత్వం రూ.17 కోట్లు మంజూరు చేసింది. అప్పటి ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి జిల్లాలో రూ. 1567.28 లక్షలు అంచనా వ్యయంతో 286 పనులకు శంకుస్థాపనలు చేశారు. ఆయన పదవీ కాలం పూర్తయింది. కానీ.. ఇప్పటి వరకు 108 పనులు పూర్తి చేశారు. రూ. 564.12 లక్షలు ఖర్చుపెట్టారు. ఇంకా 181 పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. ఇంకా రూ. 972.97 లక్షలు ఖర్చు పెట్టాల్సి ఉంది. వీటితో పాటు రంగారెడ్డి జిల్లాకు ఇతర ఎంపీలు ఇచ్చిన నిధుల ఖర్చులో కూడ నిర్లక్ష్యం నిండుకుంది. మల్కాజిగిరి ఎంపీ రేవంత్‌రెడ్డి కోటి రూపాయలతో 23 పనులను చేపట్టగా, అందులో 15 పనులు మాత్రమే పూర్తి చేశారు. దీనికి గాను రూ.58.927 లక్షలు ఖర్చు పెట్టారు. ఇంకా రూ. 41.999 లక్షలు ఖర్చు చేయాల్సి ఉంది. అలాగే భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రూ.97.99 లక్షలతో 75 పనులు మంజూరు చేశారు. అందులో 36 పనులు పూర్తిచేసి రూ. 46.499 లక్షలు ఖర్చు పెట్టారు. ఇంకా 37 పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఇందుకు గాను రూ. 51.50 లక్షలు ఖర్చు చేయాలి. నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు రూ. 156.65 లక్షల అంచనాతో 40 పనులు మంజూరు చేశారు. అందులో 29 పనులు పూర్తి కాగా, రూ. 92.530 ఖర్చు చేశారు. ఇంకా 11 పనులు పూర్తి చేయడానికి రూ.59.00 లక్షలు ఖర్చు చేయాల్సి ఉంది. మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి రూ.139.50 లక్షల అంచనాతో 33 పనులు మంజూరు చేశారు. అందులో 11 పనులు పూర్తి చేసి రూ. 36.531 లక్షలు ఖర్చు పెట్టారు. ఇంకా 22 పనులకు 98.50 లక్షలు ఖర్చు చేయాల్సి ఉంది.

చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో ఎంపీ నిధుల వివరాలు

సంవత్సరం	మంజూరైన పనులు	అంచనా వ్యయం (రూ.లక్షల్లో)	పూర్తయిన పనుల సంఖ్య	ఖర్చు చేసిన వ్యయం (రూ.లక్షల్లో)	నిలిచిపోయిన పనుల సంఖ్య	ఖర్చు చేయాల్సిన నిధులు (రూ.లక్షల్లో)
2019-20	90	475.82	79	401.01	11	55.91
2020-21	0	0	0	0	0	0
2021-22	23	196.00	09	80.00	12	75.00
2022-23	93	486.60	08	33.53	80	422.10
2023-24	92	489.96	12	49.57	78	419.96
మొత్తం	286	1567.28	108	564.12	181	972.97

కిక్కిరిసి ప్రయాణం..
పట్టుతప్పితే ప్రమాదం

- సాయంత్రం బస్సుల్లేక ప్రజల పాట్లు
- సర్వీసులు పెంచాలని ఆర్టీసీ డీఎంకు ప్రయాణికుల వేడుకోలు



పల్లెచెల్కాతండా బస్సులో ఫుట్‌బోర్డుపై నిలబడి ప్రయాణిస్తున్న విద్యార్థులు

యాచారం, నవంబరు22(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం నుంచి యాచారం, మేడిపల్లి గ్రామాల మీదుగా కడ్తాల్ మండలం పల్లెచెల్కా తండాకు సాయంత్రం వేళ ఒకే బస్సు సర్వీసు ఉండడంతో రోజూ బస్సు విద్యార్థులు, ప్రయాణికులతో కిక్కిరుస్తోంది. ఈ బస్సు తప్పితే మరో బస్సు లేకపోవడంతో ఫుట్‌బోర్డుపై విద్యార్థులు, యువకులు వేలాడుతూ ప్రయాణిస్తున్నారు. ఈ బస్సు మిస్సయితే తాము ఐదు కిలోమీటర్లు నడవమో లేక ఆటోలను ఆశ్రయించడమో తప్పదని విద్యార్థులు, తండావాసులు చెబుతున్నారు. ముఖ్యంగా మహిళలకు, విద్యార్థులకు ప్రయాణం ఉచితంగా ఉండడంతో వారంతా బస్సులోనే ప్రయాణిస్తున్నారు. అయితే బస్సులో పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కుతుండడంతో కనీసం నిల్చునేందుకు సైతం జాగా లేకుండాపోతోంది. దీంతో మహిళలు, విద్యార్థులు, ప్రధానంగా బాలికలు ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ రూట్‌లో సాయంత్రం పూట రాత్రి ఎనిమిది గంటలలోపు మరో రెండు సర్వీసులు వేయాలని తండావాసులు, ఈ రూట్‌లో ప్రయాణించే ఇతర గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ స్పందించి వెంటనే అదనపు బస్సు సర్వీసులు వేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



బస్సులో కిక్కిరిసి ప్రయాణిస్తున్న విద్యార్థులు

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి



సమావేశంలో వైద్యులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలతో స్పెషలాఫీసర్ ఆదిలక్ష్మి

ఆమనగల్లు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని మండల ప్రత్యేక అధికారి ఆదిలక్ష్మి కోరారు. వైద్యులు, సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండి ఉత్తమ సేవలందిస్తూ ప్రజల అభిమానం చూరగొంటూ ప్రభుత్వాస్పత్రుల్లో కల్పిస్తున్న సేవల పట్ల మరింత విశ్వాసం కల్పించాలని సూచించారు.ఆమనగల్లులోని ఆసుపత్రిని శుక్రవారం ఎంపీడీవో కుసుమ మాధురితో కలిసి స్పెషలాఫీసర్ సందర్శించారు. రికార్డులు, మెడిసిన్ నిల్వలు, ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్‌లో నెలకొన్న సమస్యలపై వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆక్సిజన్ సిలిండర్ల రీఫిల్లింగ్, సర్జికల్ ఎక్విప్‌మెంట్, మైనర్ రిపేర్లు చేయాలని కోరారు. అదనంగా ఎన్ని గదులు అవసరమో వాటికి అవసరమైన ప్రతిపాదనలు పంపితే ఆస్పత్రి నిధుల నుంచి కేటాయిస్తామని అధికారి తెలిపారు. అనంతరం మండల పరిషత్ మీటింగ్ హాలులో వైద్యులు, సిబ్బంది, మండలంలోని ఆశా కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని,మహిళా, శిశు ఆరోగ్యం, ప్రభుత్వం అందిస్తున్న పథకాల అమలుపై చర్చించారు. సమావేశంలో డాక్టర్లు పరిక్షిత్, మంజులాదేవి, నాగరాజు, ఎంపీహెచ్‌ఈవో తిరుపతిరెడ్డి, వైద్య సిబ్బంది, ఆశాలు, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

శివాలయానికి విరాళం అందజేత



ఆలయ కమిటీకి చెక్కు అందజేస్తున్న నీలావతమ్మ

శంకర్‌పల్లి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):ప్రతొక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని చందిప్ప మరకత శివాలయ చైర్మన్ గోపాల్‌రెడ్డి అన్నారు. శివాలయ గర్భగుడిలో వెండితో ప్రాణమఠం చేయించేందుకు రూ.12లక్షల చెక్కును రాపోలు నీలావతమ్మ శుక్రవారం చైర్మన్ గోపాల్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి చేయూతనివ్వడం శుభపరిణామమన్నారు. శివుడి ఆశీస్సులు ప్రతొక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

క్రైం కార్నర్

పాఠశాల సెప్టిక్ ట్యాంక్‌లో మృతదేహం లభ్యం

శంకర్‌పల్లి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి ఆదర్శ పాఠశాల సెప్టిక్ ట్యాంకులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. విద్యార్థులు శుక్రవారం సాయంత్రం ఆడుకుంటున్న సమయంలో సెప్టిక్ ట్యాంక్‌లో శవాన్ని చూసి టీచర్లకు తెలిపారు. ఈ ఘటనపై ఉపాధ్యాయులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. మున్సిపల్ సిబ్బందితో శవాన్ని ట్యాంక్ నుంచి వెలికి తీయించారు. శవం కుళ్లిపోయింది. శరీరం నుంచి తల, రెండు చేతులు ఊడిపోయాయి. ట్యాంక్‌లో తల లభించగా చేతులు దొరకలేదు. 15-20రోజుల క్రితమే వ్యక్తి చనిపోయుంటాడని పోలీసులు భావిస్తున్నారు.మృతుడి వయసు 35 నుంచి 40ఏళ్ల మధ్య ఉంటుందని తెలిపారు. అతడు ప్రమాదవశాత్తు ట్యాంక్‌లో పడ్డాడా? లేక ఎవరైనా చంపారా? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మృతుడెవరో తేలలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించామని సీఐ పేర్కొన్నారు.

వాహనం ఢీకొట్టి యువకుడి దుర్మరణం



మృతిచెందిన మల్లేష్

చౌదరిగూడ, నవంబరు22(ఆంధ్రజ్యోతి): కూలి పనిచేసుకుని జీవనం సాగిస్తున్న ఓ యువకుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టగా మృతి చెందిన ఘటన కొందుర్గు శివారు దివ్యశక్తి పేపర్ మిల్ సమీపంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కొందుర్గుకు చెందిన లచ్చంపేట మల్లేష్ (23) బైక్‌పై జిల్లేడ్‌చౌదరిగూడ మండలం లచ్చంపేట్‌కు బయల్దేరాడు. పేపర్ మిల్ సమీపంలో అతడిని వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన మల్లేష్‌ను షాద్‌నగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. మల్లేష్‌కు భార్య సుజాత, నాలుగు నెలల మగ శిశువు ఉన్నట్లు తెలిసింది. ఇదిలా ఉంటే సంఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

బంగారు గొలుసు అపహరణకు యత్నం

యాచారం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఒంటరిగా ఉన్న మహిళ మెడలోని బంగారు మంగళసూత్రాన్ని అపహరించేందుకు యత్నించిన దుండగుడ్ని మహిళ ప్రతిఘటించడంతో పరారైన ఘటన గురువారం సాయంత్రం గున్గల్‌లో చోటుచేసుకుంది. యాచారం సీఐ నర్సింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. గున్గల్‌కు చెందిన పందుగుల గాయత్రి ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో ఓ గుర్తుతెలియని ఆమె వద్దకు వచ్చి పేపర్ చూపుతూ అడ్రస్ చెప్పాలని అడిగాడు. తెలియదని ఆమె అంటుండగానే ఆమె మెడలోని నాలుగు తులాల బంగారు పుస్తెలతాడును తెంపజూశాడు. గాయత్రి దొంగను ప్రతిఘటించడంతో పుస్తెలతాడు తెగింది. దొంగ దొంగ అని అవరవడంతో స్థానికులు రావడం చూసి దుండగుడు పారిపోయాడు. విషయం తెలుసుకున్న సీఐ గ్రామానికి వెళ్లి పరిశీలించారు. గ్రామంలోని సీసీ కెమెరా ఫుటేజీలు చెక్‌చేస్తూ దర్యాప్తు చేస్తున్నారు.

సర్వే డాటాను పక్కాగా నమోదు చేయాలి



డాటా ఆపరేటర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో నరేందర్‌రెడ్డి

యాచారం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కొన్ని రోజులుగా సాగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డాటాను శనివారం నుంచి ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేస్తామని, ఎన్యూమరేటర్లు సేకరించిన సమాచారాన్ని తప్పుల్లేకుండా నమోదు చేయాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి ఆపరేటర్లకు సూచించారు. శుక్రవారం మండల పరిషత్‌లో సర్వే ఆన్‌లైన్ నమోదుపై ఆపరేటర్లకు శిక్షణిచ్చారు. డాటాను నమోదులో నిర్లక్ష్యం చేయొద్దన్నారు. వ్యక్తుల వివరాలను సెల్‌ఫోన్లలో చిత్రీకరించొద్దని, ఫోన్‌నంబర్లను కూడా నోట్ చేసుకోవద్దని స్పష్టం చేశారు. ఆపరేటర్లు రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 6గంటల వరకు డాటా నమోదు చేయాలన్నారు. పని సమయంలో ఫోన్లు మాట్లాడకుంటే మంచిదన్నారు. చాలా అప్రమత్తతతో డాటాను నమోదు చేయాలన్నారు. ఇప్పటి వరకు 30 కంప్యూటర్లను సిద్ధంచేశామని, అవసరమైతే మరిన్ని తెప్పిస్తామని ఎంపీడీవో చెప్పారు. ప్రతీ పత్రాన్ని క్షుణ్ణంగా చదివే ఉన్న వివరాలను నమోదు చేయాలని ఆపరేటర్లకు చెప్పారు. మండలంలో 15,808 కుటుంబాలకు 13,713 కుటుంబాల సర్వే పూర్తయిందన్నారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీలత, కార్యాలయ సూపరింటెండెంట్ శైలజ తదితరులు ఉన్నారు.

అక్రమ వెంచర్ హద్దుల తొలగింపు



మాడ్గుల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొల్కులపల్లి పరిధిలో వెలసిన అక్రమ వెంచర్‌పై అధికారులు చర్యలు తీసుకున్నారు. శుక్రవారం మండల పంచాయతీ అధికారి వేజన్న వెంచర్‌ను పరిశీలించి ఈ వెంచర్‌కు ఎన్నిసార్లు నోటీసులిచ్చినా పర్మిషన్ తీసుకోలేదన్నారు. సిబ్బందితో లేఔట్ ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేయించారు.

లగచర్ల రైతులను విడుదల చేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమేష్ తదితరులు

మంచాల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): లగచర్ల రైతులను బేషరతుగా విడుదల చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం మంచాలలో ప్యాక్స్ మాజీ చైర్మన్ పుల్లారెడ్డి, కిషన్‌రెడ్డి, బహద్దూర్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఫార్మాసిటీ పేరుతో లగచర్ల, మరో ఐదు గ్రామాల రైతుల భూములను లాక్కోవడం అక్రమమన్నారు. గిరిజనుల భూములు లాక్కొని ముఖ్యమంత్రి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. భూసేకరణను వ్యతిరేకించిన అన్నదాతలను తీవ్రవాదులుగా పరిగణిస్తూ అరెస్టులు చేయడం అన్యాయం అన్నారు. రైతులపై పెట్టిన కేసులను ఉపసంహరించి జైలు నుంచి విడుదల చేయాలన్నారు. లేదంటే రైతుల పక్షాన ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు వెంకటేష్, జానీ పాషా, రాజు, శంకర్, ప్రకాశ్‌రెడ్డి, ప్రశాంత్, రాజేష్, మల్లేష్, సత్తయ్య పాల్గొన్నారు.

విద్యాపీఠ్‌లో డ్రాప్ రోబాల్ చాంపియన్‌షిప్ పోటీలు



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులతో మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి తదితరులు

ఇబ్రహీంపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నంలోని గురుకుల విద్యాపీఠ్ హైస్కూల్‌లో శుక్రవారం రాష్ట్రస్థాయి డ్రాప్ రోబాల్ చాంపియన్‌షిప్ 3వ సబ్ జూనియర్, రెండో జూనియర్ బాలబాలికల సెలక్షన్, టోర్నీ నిర్వహించారు. పోటీలను మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి, విద్యాపీఠ్ ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస్‌రావు ప్రారంభించారు. వివిధ జిల్లాల నుంచి వంద మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన వారు 2025 జనవరిలో జాతీయస్థాయి డ్రాప్ రోబాల్ చాంపియన్‌షిప్ పోటీల్లోపాల్గొంటారని తెలంగాణ డ్రాప్ రోబాల్ అసోసియేషన్ కార్యదర్శి రహమత్‌అలీ, పర్యవేక్షకులు అక్బర్ పాషా తెలిపారు.

ఆలయాభివృద్ధికి నిధులు విడుదల చేయాలి



ఆలయం వద్ద ఎమ్మెల్యేలు సబితారెడ్డి, యాదయ్య, నాయకులు

షాబాద్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారాంపురం ఆలయ భూములను గతంలో స్వాధీనం చేసుకొని పేదలకు ప్లాట్లు ఇచ్చిందని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి తెలిపారు.ఇందుకు ప్రతిగా ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించిందన్నారు. ప్రభుత్వం వెంటనే ఆ నిధులు విడుదల చేయాలని కోరారు. శుక్రవారం సీతారాంపురానికి చెందిన గురుస్వామి సందీప్ నిర్వహించిన అయ్యప్ప పడిపూజకు ఎమ్మెల్యేలు సబితారెడ్డి, యాదయ్య హాజరయ్యారు. సబితారెడ్డి మాట్లాడుతూ... ఆలయ భూమిలో పేదలకు ప్లాట్లు ఇచ్చినందున గుడి అభివృద్ధికి ప్రభుత్వ నిధులు తెచ్చి అభివృద్ధికి చొరవచూపాలని ఎమ్మెల్యే యాదయ్యకు సూచించారు. పూజల్లో డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు డి.ఆంజనేయులు, పట్నం అవినాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామన్నగూడలో ఘనంగా అయ్యప్ప పడిపూజ



అయ్యప్ప పడిపూజ చేస్తున్న దయాకర్‌స్వామి తదితరులు

చేవెళ్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రామన్నగూడలో శుక్రవారం పెద్దోళ్ల దయాకర్ స్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడిపూజను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు పూజాకార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురుస్వామి కృష్ణ, కిరణ్‌కుమార్‌చారి పర్యవేక్షించారు. అయ్యప్ప భజనలతో గ్రామం మార్మోగింది. పడి పూజలో మహేశ్వరం, చేవెళ్ల ఎమ్మెల్యేలు సబితారెడ్డి, యాదయ్య, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్, వివిధ పార్టీల సీనియర్ నాయకులు శివప్రసాద్, లావణ్యాశంకర్, శైలజాఆగిరెడ్డి, కృష్ణారెడ్డి, కె.శివకుమార్, వెంకటేశం, అనంతరెడ్డి, టి.చంద్రశేఖర్, ప్రభాకర్‌రెడ్డి, వైభవ్‌రెడ్డి, వెంకటేశ్, మాధవరెడ్డి, సుభాష్‌గౌడ్, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

బంతి సాగుతో అధిక లాభాలు

చేవెళ్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): బంతిసాగుతో రైతులు అధిక లాభాలు పొందొచ్చని నాందారి సీడ్స్ మేనేజర్ శ్రీధర్ తెలిపారు. శుక్రవారం గొల్లపల్లిలో రైతులు సాగు చేసిన బంతి తోటలను పరిశీలించి సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. సంప్రదాయ పంటలకంటే నగరానికి చేరువలో ఉన్న ప్రాంతాల్లో పూలసాగుతో అధిక లాభాలు గడించొచ్చని చెప్పారు. మార్కెట్లలో బంతిపూలకు డిమాండ్ ఉందన్నారు. హైబ్రీడ్ బంతిపూల కలర్, బాగుటుందని, అలాగే దిగుబడి ఎక్కువ వస్తుందని తెలిపారు. బంతి తోటల రైతులు శ్రీనివాస్‌గౌడ్, సురేందర్‌గౌడ్‌లను శాలువాలతో సన్మానించారు. కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



బంతిసాగుపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ఆమనగల్లు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో పాండు అన్నారు. ఆమనగల్లు ఎమ్మార్సీలో శుక్రవారం ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పాఠశాలల బలోపేతం, మధ్యాహ్న భోజన నిర్వాహణ, పరీక్షల రికార్డుల నమోదు తదితరాంశాలపై చర్చించారు. విద్యార్థులకు మధ్యాహ్నం పుష్టకర భోజనం పెట్టాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. డిసెంబరు 4వ తేదీ నుంచి నేషనల్ అచీవ్‌మెంట్ తుది పరీక్షలు నిర్వహించాలన్నారు. టీచర్లు యాప్సెంట్ కావొద్దని తెలిపారు. సమావేశంలో వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు రామలక్ష్మి, పద్మ, మండల కో-ఆర్డినేటర్ సాయికుమార్, సీఆర్పీలు ఎస్.అహ్మద్, కిషన్ పాల్గొన్నారు.

ఓటు నమోదుకు 29 వరకు గడువు



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, ఇన్‌చార్జి ఆర్డీవో అనంతరెడ్డి

కందుకూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నూతన ఓటర్లు, అభ్యంతరాలపై నమోదు సరళిని డిప్యూటీ కలెక్టర్ పద్మావతి శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో పరిశీలించారు. ఇన్‌చార్జి ఆర్డీవో అనంతరెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్లు, డీటీలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సంఘం ఆదేశానుసారం ఈ నెల 29వ తేదీ వరకు ఓటర్ల నమోదు, సవరణలు చేపట్టాలన్నారు. ఒకటి కంటే ఎక్కువ చోట్ల, అలాగే ఒకే ఊరిలో ఒకటి కంటే ఎక్కువ సార్లున్న పేర్లను, బోగస్ ఓట్లను లిస్టుల్లోంచి తొలగించాలన్నారు. పేర్లు, అడ్రెస్‌లలో తప్పులుంటే సరిచేసుకునే అవకాశం కూడా ఉందన్నారు. సమావేశంలో నియోజకవర్గం ఎన్నికల సంఘం తహసీల్దార్ ఇలేషం అలీ, ఇన్‌చార్జి శేఖర్, బాలాపూర్, మహేశ్వరం, సరూర్‌నగర్ మండలాల తహసీల్దార్లు ఇందిరాదేవి, సైదులు, వేణుగోపాల్, కందుకూరు డీటీ తాజుద్దీన్, ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజులపాటు ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియ



చేవెళ్ల: ఈ నెల 23, 24 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తామని చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ శుక్రవారం తెలిపారు. డివిజన్‌లోని ప్రతీ పోలింగ్ బూత్ వద్ద బూత్ లెవల్ ఆఫీసర్లు అందుబాటులో ఉంటారని చెప్పారు. 1-1-2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతీ పౌరుడు ఫారం 6 ద్వారా ఓటు హక్కుకు పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. బోగస్ ఓట్ల తొలగింపు, పేర్ల తప్పుల్లో సవరణలు, ఓటర్ల మైగ్రేషన్ తదితరాలు కూడా నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు.

రహ'దారుణం'

(5వ పేజీ తరువాయి)

చెందిన ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మక్కోనికుంట దగ్గర కల్వర్టు వద్ద రోడ్డు దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. అదే విధంగా వేముల్‌నర్వ శివారులో మిషన్ భగీరథ పైప్‌లైన్ వేసేందుకు రోడ్డు తవ్వారు. అక్కడ సిమెంట్ సరిగా వేయకపోవడంతో గుంతలు పడ్డాయి. దానికి సమీపంలోనే వరద తాకిడికి రోడ్డు కోతకు గురైంది. వేముల్‌నర్వ నుంచి ఇప్పలపల్లి మార్గంలో చౌదరిగూడ, దత్తాయపల్లి గేటు సమీపంలో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఇప్పలపల్లి నుంచి కమ్మదనం వరకు రోడ్డుపై భారీ గుంతలేర్పడ్డాయి. పాపిరెడ్డిగూడ సమీపంలోని మలుపుల వద్ద రోడ్డుపై రాళ్లు తేలడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఈ రోడ్డును విస్తరించి పటిష్ఠంగా నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డుకు మరమ్మతు చేపట్టాలి

కేశంపేట నుంచి షాద్‌నగర్ వరకు దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతు చేయాలి. అడుగడుగునా గుంతలు ఏర్పడటంతో బైక్ నడపడం కూడా కష్టంగా ఉంది. ఈ రోడ్డులో తరచూ ప్రమాదాలు జరుతున్నా అధికారులు పాలకులు పట్టించుకోవడం లేదు.

- పసుల నరసింహ యాదవ్, బీజేపీ నాయకుడు, కేశంపేట

వాహనాలు దెబ్బతింటున్నాయి

ఈ రోడ్డుపై అడుగుకో గుంత ఉండటంతో వాహనాలు పాడవుతున్నాయి. తరచూ రిపేర్లు వస్తున్నాయి. మిషన్ భగీరథ, రైతుల అవసరాలకు తవ్విన రోడ్లను పూడ్చకుండా అలాగే వదిలేశారు. వేముల్‌నర్వ సమీప రోడ్డుపై చాలా గుంతలు ఏర్పడ్డాయి.

- గౌండ్ల అశోక్‌కుమార్, వేముల్‌నర్వ, కేశంపేట మండలం

సామాజిక సేవల్లో పాలుపంచుకోవాలి



కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న ఎస్ఐ వెంకటేశ్, వరప్రసాద్‌రెడ్డి

ఆమనగల్లు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవల్లో ప్రతొక్కరు పాలుపంచుకోవాలని ఆమనగల్లు ఎస్ఐ వెంకటేష్ అన్నారు. పట్టణంలోని శ్రీలక్ష్మీ గార్డెన్స్‌లో ఐక్యత ఫౌండేషన్, చెన్నై శంకరన్ నేత్రాలయం సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరం శుక్రవారం నాలుగో రోజు కొనసాగింది. ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. శిబిరాన్ని ఎస్ఐ సందర్శించి ఫౌండేషన్ ఈడీ ఎస్.వరప్రసాద్‌రెడ్డితో కలిసి దృష్టిలోపం ఉన్న వారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. 27వ తేదీ వరకు శిబిరం ఉంటుందని వరప్రసాద్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్‌సభ్యుడు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీరాములు, నరేందర్ గౌడ్, జైపాల్‌రెడ్డి, చంద్రశేఖర్, మల్లేశ్, కొండల్ రెడ్డి,మల్లయ్య, కొండల్, రమేశ్, రఘు, మల్లేశ్, యాదయ్య, శేఖర్, శ్రీపతి, శివ,కల్యాణ్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

రమేష్ కుటుంబాన్ని ఆదుకోవాలి

కొత్తూర్: మావోయిస్టుల చేతిలో హతమైన పంచాయతీ కార్యదర్శి రమేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పెంజర్ల కార్యదర్శి, తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హెచ్.సురేందర్ డిమాండ్ చేశారు. ఇన్‌ఫార్మర్ అని రమేష్‌ను హతమార్చడాన్ని సరికాదన్నారు. రమేష్ కుటుంబానికి కోటి రుపాయల పరిహారం, కుటుంబంలో ఒకరి ఉద్యోగమివ్వాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

డిమాండ్లు నెరవేర్చాలని తహసీల్దార్‌కు వినతి

కేశంపేట/కందుకూరు: ధర్మ సమాజ్‌పార్టీ(డీఎస్పీ) ప్రభుత్వం ముందు ఐదు డిమాండ్లు పెట్టిందని, వాటిని నెరవేర్చాలని పార్టీ మండల కన్వీనర్ మహిపాల్ డిమాండ్ చేశారు. ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి, ఇల్లు, భూమి ఇవ్వాలని శుక్రవారం కేశంపేట తహసీల్దార్ మీర్ ఆజం అలీకి వినతిపత్రం ఇచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. రాష్ట్రంలో కోటి కుటుంబాల సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి రమేష్, నాయకులు శివ, కృష్ణ, నరసింహ, విష్ణు, నరేష్, పురుషోత్తం, శ్రీకాంత్, మహేష్, ప్రవీణ్, యాదయ్య పాల్గొన్నారు.

కందుకూరులో డీఎస్పీ రాష్ట్ర నాయకుడు రహమాన్, జిల్లా కన్వీనర్ అమరేందర్, పార్టీ మండల కన్వీనర్ ఆంజనేయులు డీటీ తాజుద్దీన్‌కు వినతిపత్రం ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు మౌలిక సౌకర్యాలైన విద్య, వైద్యం, ఇల్లు, భూమి, ఉపాధి కల్పించాలన్నారు. కార్యక్రమంలో రవీందర్, రంజిత్, శేఖర్, భాస్కర్, చక్రపాణి, ఓంకార్ పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన ఉప్పల వెంకటేశ్

ఆమనగల్లు: తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ నెల 27న తన కుమారుడు డాక్టర్ ఉప్పల అనిల్-భావనల పెళ్లికి హాజరుకావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు.

కొనుగోళ్లను వేగవంతం చేయాలి

ఆమనగల్లు: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఎంపీడీవో కుసుమ మాధురి అన్నారు. ఆమనగల్లు ఏఎంసీలో కేంద్రాన్ని స్పెషలాఫీసర్ ఆదిలక్ష్మితో కలిసి పరిశీలించారు. కాంట వేసిన వడ్లను వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. అధికారులతో ఏఎంసీ సూపర్‌వైజర్ రాజేశ్వరి, ప్యాక్స్ సీఈవో దేవేందర్ ఉన్నారు.

చైర్మన్‌లకు కాంగ్రెస్ నాయకుల సన్మానం

కందుకూరు: రాష్ట్ర అర్బన్, ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, మహేశ్వరం ఏఎంసీ చైర్మన్ కృష్ణానాయక్‌లను కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. కాంగ్రెస్ మండల నాయకులు అజీజ్, కుమార్, పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో నేతలను వేర్వేరుగా సన్మానించారు. కార్యక్రమాల్లో నాయకులు గణేశ్, పి.రవి, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆమనగల్లు: కులవృత్తుల సంక్షేమానికి ప్రభుత్వాలు పెద్దపీట వేయాలని మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్‌చైర్మన్ దుర్గయ్య అన్నారు. ఆమనగల్లులోని సురసముద్రం చెరువులో చేపపిల్లలు వదిలారు. కమిషనర్ వసంత, ఎంపీడీవో మాధురి, వైస్‌చైర్మన్ దుర్గయ్య, ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటయ్యలతో కలిసి రాంపాల్ చెరువులో చేపపిల్లలు వదిలారు. సురసముద్రంలో ఈ ఏడాది 5.8లక్షల చేప పిల్లలు వదిలాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లక్ష్మణ్, విజయ్‌కృష్ణ, మత్స్యశాఖ ఫీల్డ్ ఆఫీసర్ అంబేడ్కర్, ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటయ్య, సంఘం నాయకులు యాదయ్య, రాజు, మహేశ్, వెంకటయ్య, రాజు, యు.వెంకటయ్య, సభ్యులు పాల్గొన్నారు.

22వ రోజుకు మండల సాధన దీక్షలు

తలకొండపల్లి: గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించకుంటే పోరాటం ఉధృతం చేస్తామని జేఏసీ నాయకులు పేర్కొన్నారు. గట్టిప్పలపల్లిని ప్రభుత్వం మండల కేంద్రంగా చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారంతో 22వ రోజుకు చేరాయి. వివిధ పార్టీల, సంఘాల నాయకులు, మహిళలు, యువకులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్‌చైర్మన్ శరత్‌చంద్ర, కొండల్‌రెడ్డి, కృష్ణ, దాను, ఈదమయ్య పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కడ్తాల్:బాధిత కుటుంబాలను, నిరుపేదలను ఆదుకుంటామని మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చేయూతనిస్తున్నట్లు చెప్పారు. గాన్గుమర్ల తండాలో అనారోగ్యంతో మృతిచెందిన లక్ష్మణ్ కుటుంబాన్ని పరామర్శించి తన ట్రస్ట్ ద్వారా రూ.5వేల సాయం అందజేశారు.

రాజ్యాధికారమే లక్ష్యంగా పనిచేయండి

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):బీసీలు ఐక్యంగా ఉంటూ రాజ్యాధికారమే లక్ష్యంగా పనిచేయాలని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. షాద్‌నగర్‌లోని యాదాద్రి హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో సేన ఫరూఖ్‌నగర్ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుమ్మరి కృష్ణ, ఉపాధ్యక్షుడు సాయికుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్, సహాయ కార్యదర్శి శివకుమార్, కోశాధికారిగా లింగంలను ఎన్నుకున్నారు. కృష్ణ మాట్లాడుతూ బీసీలు రాజకీయ పార్టీల జెండాలు మోస్తూ కార్యకర్తల్లా మిగిలేకంటే ఐక్యంగా ఉంటూ రాష్ట్రాన్ని ఏలే నేతలుగా ఎదుగాలని కోరారు. ఎస్సీ, ఎస్టీలను కలుపుకుని అధికారం కోసం బీసీ బిడ్డలంతా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ సేన నాయకులు రఘునాథ్‌యాదవ్, ప్రశాంత్‌ముదిరాజ్, శ్రీశైలం, శివ, రాజు మహేష్, రాజేష్, సంతోష్ పాల్గొన్నారు.



కుమ్మరి మల్లేష్‌కు నియామకపత్రం అందజేస్తున్న కృష్ణ